క్లుప్తంగా

సత్యసాయిబాబా జయంతి వేడుకలు



సీతానగరం మందిరంలో పూజలు చేసిన దృశ్యం

సీతానగరం: సత్యసాయిబాబా జయంతి వేడుకలు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం సీతానగరం సత్యసాయిబాబా మందిరంలో సత్యసాయి బాబా జన్మదినోత్సవం సందర్భంగా తెల్లవారుజామున సాయినామ స్మరణతో నగర సంకీర్తన కార్యక్రమం చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు భక్తుల స్వీకరించారు. అనంరతం మధ్యాహ్నం జరిగిన అన్నసమారాదన కార్యక్రమంలో ఆరువేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్ర 6 గంటల నుంచి సాయి భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మకు వెండి సామగ్రి బహూకరణ



విజయదుర్గమ్మకు వెండి సామగ్రి సమర్పిస్తున్న భక్తులు

రంగంపేట: రంగంపేట గ్రామంలో స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన విజయదుర్గ అమ్మవారికి భక్తులు వెండి సామగ్రి బహూకరించినట్టు ఆలయ అర్చకులు నారాయణశర్మ తెలిపారు. గ్రామానికి చెందిన పోలిన వెంకట కిరణ్ కుమార్, కౌసల్య దంపతులు అమ్మవారికి వెండి దీపం కుందులు, పళ్లేలు బహూకరించారన్నారు.

మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలి మృతి



దేవలంక రత్నం

రాజానగరం: మండలంలోని నరేంద్రపురానికి చెందిన సీనియర్ రాజకీయ, రైతు నాయకుడు దేవలంక శ్రీరామూర్తి (రాము) అర్ధాంగి, రాజానగరం మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు మృతి దేవలంక రత్నం(68) మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై దివాన్‌చెరువులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాసను విడిచారు. స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల వీర్రాజు శనివారం నరేంద్రపురం వచ్చి రత్నం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భూసార పరీక్షలతో అధికి దిగుబడి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు
- భూసార పరీక్ష పత్రాలు అందజేత



బొల్లెద్దుపాలెం ఆర్‌బీకేలో రైతులకు భూ సార పరీక్ష పత్రాలను అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

మధురపూడి: భూసార పరీక్షల ఆధారంగా సాగు చేయడం ద్వారా పంట దిగుబడి పెరుగుతోందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాధవరావు అన్నారు. బొల్లెద్దుపాలెంలో శనివారం రైతులకు భూసార పరీక్ష పత్రాలను రైత న్నలకు అందజేసే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా పొలంలోని పోషకాల సమాచారం తెలుస్తోందని, దాని ఆధారంగా పంట సాగుతో రైతులకు మేలు జరుగుతోందన్నారు. దాని ప్రకారం పంటకు ఇవ్వాల్సిన ఎరువుల మోతాదును అంచనా వేయడానికి వీలవుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, ఏఈవో సామ్‌సాన్ డేవిడ్, వీఏఏ ఫిరోజ్ సిబ్బంది పాల్గొన్నారు.

29న రుద్రాక్షలతో పంచాక్షరి జపం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గాడాల గ్రామంలో మహాలక్ష్మి సమేత చిన్నవేంకటేశ్వరస్వామి వారి పీఠంలో కొలువుతీరిన చక్రవాహినిభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారికి ఈ నెల 29వ తేదీ తెల్లవారుజామున 4.30 గంటల నుంచి రుద్రాక్షలతో పంచాక్షరి మంత్రం జరుగుతుందని తెలంగాణాలోని మంచిర్యాల అవధూత దత్త సాయి మహారాజ్ అన్నారు. శనివారం ఆయన పీఠాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయరాష్ట్రాల చైర్మన్ మతాలరమేష్, పీఠం నిత్య సేవకుడు దత్త నృసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబళ్లకు తగ్గిన ఆదరణ

- ఇసుక తరలింపులో ట్రాక్టర్ల వినియోగం
- జీవనోపాధి కోల్పోయిన ఎడ్లబళ్ల యజమానులు
- పోషణకు ఇబ్బంది పడుతున్న సుమారు వెయ్యి కుటుంబాలు



ఎడ్లబళ్లపై తరలిస్తున్న ఇసుక (ఫైల్)

సీతానగరం: కాలంలోపాటు యాంత్రీకరణ ఆవశ్యకత పెరగడంతో పల్లెల్లో ఎడ్లబళ్లకు ఆదరణ తగ్గిందనే చెప్పవచ్చు. మండలంలో ఇసుక తరలించాలంటే ఎడ్లబళ్లనే వినియోగించేవారు. గోదావరి వరద సమయంలో తప్ప నదీ పరివాహక ప్రాంత గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలకు ఎడ్లబళ్లు నుంచే ఇసుకను తీసుకువచ్చేవారు. వీటితోపాటు మొక్కజొన్న, వరి తదితర పంటలను తీసుకొచ్చేవారు. అక్కడ నుంచి పంటను లారీల్లో తరలించేవారు. ఇలా ఎడ్లబళ్ల యజమానులకు ఉపాధి లభించేంది. ప్రస్తుతం అందరూ ట్రాక్టరుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్నామని ఎడ్లబళ్ల యజమానులు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వంలో

కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం అంటూ ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై ఇసుక తీసుకువెళ్లవచ్చని అనుమతులు ఇచ్చారు. అదే విధంగా 2014 టీడీపీ హయాంలో ట్రాక్టర్లపై ఇసుకను తరలించే వారు. అప్పుడు ఇప్పుడు ఎడ్లబళ్లపై తెచ్చే ఇసుక తీసుకువెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. నాలుగు బళ్ల ఇసుక ఒక ట్రాక్టరుపై వస్తుందనే ఉద్దేశంతో ఇసుక అవసరమైన వారు ట్రాక్టర్‌తో ఇసుక తెచ్చుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో

గత ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో ట్రాక్టర్లపై ఇసుక తరలింపుపై నిషేధించడంతో ఎడ్లబళ్ల వినియోగం ఎక్కువగా ఉండేది. ఎడ్లబళ్ల పైనే ఇసుకను తరలించేవారు. దీనివల్ల మండలంలో ఉన్న వెయ్యి ఎడ్లబండ్ల యజమానులకు జీవనోపాధి ఉండేది. వారి కుటుంబాలు ఏ ఇబ్బంది లేకుండా గడిచేవి. మండలంలోని రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, ముగ్గళ్ళ, ఇనుగంటివారిపేట, మునికూడలి, బొబ్బిల్లంక తదితర గ్రామాల ఇసుక ర్యాంపు నుంచి ఎడ్లబళ్లు నుంచి ఇసుకను తరలించేవారు. ఏటిగట్టును ఆనుకుని ఉన్న గ్రామాల్లో బండి ఇసుక రూ.350గా కొనుగోలు చేసేవారు. ఒక్కో బండి ద్వారా మూడు ట్రిప్పులు ఇసుక తోలకం జరిపి రూ.1000 సంపాదించేవారు. ఇందులో కొంత ఎడ్ల దాణాకు అయినా రోజుకు రూ.700 మిగిలేది.

దీంతో ఎడ్లబళ్లపై ఇసుక కోసం స్థానికులు ఎవరు తీసుకువెళ్లడం లేదు. దీనితో ఎడ్లబళ్లు నుంచి ఇసుక తరలింపు లేకుండా పోవడంతో ఎడ్లబళ్లపై ఆధారపడి ఉన్న పలు కుటుంబాలు వీధిన పడ్డాయి.

ట్రాక్టర్లకే మొగ్గు

గ్రామాల్లో ఇసుక అవసరమైన వారు ట్రాక్టర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. సీతానగరం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం తదితర గ్రామాలకు ట్రాక్టర్ ఇసుక రూ.1,100 నుంచి రూ.1,200వరకు అమ్మకాలు జరుపుతున్నారు.

జీవనోపాధి కోల్పోయాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎడ్లబళ్లపై ఇసుక రవాణ తగ్గింది. దీనివల్ల జీవనోపాధి కోల్పోయాం. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో ట్రాక్టర్లపై ఇసుక రవాణా ఉండేది. ట్రాక్టర్లను నిషేధించారు. అప్పుడు ఎడ్లబళ్లకు డిమాండ్ ఉండేది. రోజుకు మాకు కూలి డబ్బులు మిగిలేది. ఇప్పుడు ఇసుక కావాలని అడిగేవారు లేరు. అందరూ ట్రాక్టర్లుపై ఇసుక తెచ్చుకుంటున్నారు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మాదాసు రాంబాబు, సీతానగరం వెలమపేట

కుటుంబ పోషణ కష్టమై..



గత వైఎస్సార్ సీపీ హయాంలో ట్రాక్టర్లపై ఇసుక రవాణా నిషేధించారు. ఎడ్లబండ్లపై ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వడంతో ఎడ్లబళ్ల యజమానులు తమ కుటుంబాలను చక్కగా పోషించుకునేవారు. కూటమి ప్రభుత్వం ఎడ్లబళ్లతోపాటుగా ట్రాక్టర్లకు ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారు. దీనితో ట్రాక్టర్లపై ఇసుక తెచ్చుకుంటున్నారు. ఎడ్లబళ్లపై ఇసుక ను ఎవరు తెచ్చుకోవడం లేదు. దీవల్ల ఉపాధి కోల్పోయాం. ప్రభుత్వమే దారి చూపాలి.

–కొంచ భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు, వంగలపూడి

నన్నయలో ఇషా వాలీబాల్, త్రో బాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: గ్రామాలు గ్లోబల్ విలేజ్‌లుగా మారుతున్న నేటి కాలంలో మన సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగువుతున్నాయని, ఈ తరుణంలో గ్రామోత్సవాల పేరిట క్రీడా పోటీలను నిర్వహించడం హర్షనీయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు నిర్వాహకులను అభినందించారు. యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో 16వ ఇషా గ్రామోత్సవ్, భారతదేశ క్రీడా స్ఫూర్తి రూరల్ ప్రీమియం లీగ్–2024 దక్షిణ భారత స్థాయి వాలీబాల్, త్రో బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి, వారిలోని ప్రతిభను వెలికితీయడాని ఇవి ఎంతగానో తోర్పడతాయన్నారు. 2004లో సద్గురు ప్రారంభించిన ఇషా గ్రామోత్సవాలు ప్రస్తుతం అన్ని రాష్ట్రాలలోను జరుగుతున్నాయన్నారు. విజేతలకు క్లస్టర్ స్థాయిలో పురుషులలో మొదటి బహుమతిగా రూ.9 వేలు, రెండో బహుమతిగా రూ.6 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు, నాలుగో బహుమతిగా రూ.2 వేలు అందజేస్తారు. త్రో బాల్‌లో మహిళలకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3 వేలు, మూడో బహుమతిగా రూ.2 వేలు, నాలుగో బహుమతిగా రూ.1500 అందజేస్తారు. ఫైనల్ పోటీలు కొయంబత్తూరులోని ఈషా ఆశ్రమంలోని ఆదియోగి సమక్షంలో జరుగుతాయని ఇషా ఫౌండేషన్ రాజమహేంద్రవరం వలంటీర్లు తెలిపారు. ఈ పోటీలకు పురుషుల విభాగంలో 29, మహిళల విభాగంలో 15 టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డీఎం ఎం.శేషగిరి, ఇషా వలంటీర్లు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల షెడ్ల నిర్మాణం

ద్వామా పీడీ నాగ మహేశ్వరరావు



బొబ్బిల్లంకలో పశువుల షెడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ద్వామా పీడి నాగ మహేశ్వరరావు

సీతానగరం: పాడి రైతులకు ఉపాధిహామీ పథకంలో 90 శాతం సబ్సిడీపై నెలకొల్పే పశువుల షెడ్లుల నిర్మాణం సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం సంచాలకులు ఎ.నాగ మహేశ్వరరావు సూచించారు. మండలం కాటవరం, బొబ్బిల్లంక లలో మూడు పశువుల షెడ్లను శనివారం ఆయన పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల వద్ద రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను పరిశీలించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 50 పశువుల షెడ్లుల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయన్నారు. దీనిని పాడి రైతులు చక్కగా ఉపయోగించుకొని, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. మండలంలో 34 అంగన్‌వాడీ సెంటర్లు వద్ద రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బందిని డ్వామా పీడీ నాగ మహేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కె.నాగేశవేణి, టెక్నికల్ అసిస్టెంట్లు ఎ.చక్రవర్తి, వి.వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎస్ఎస్ మూర్తి, పి.శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా



సీతానగరం నుంచి అక్రమంగా వెళుతున్న కలప వాహనం

సీతానగరం: ఇతర మండలాల నుంచి కలప అక్రమ రవాణ జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దేవీపట్నం మండలం నుంచి కలపను వాహనాలపై సీతానగరం మండల గ్రామాలకు, అదేవిదంగా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లు వంటి పలు వాహనాలపై పలు రకాలైన అటవీ సంపదైన కలపను అక్రమంగా రవాణా చేసి జేబులు నింపుకొంటున్నారు. అటవీ శాఖాధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కలప వ్యాపారులు బాహాటంగా కలపను వాహనాలపై రవాణ చేస్తున్నారు. పగలు, రాత్రి అనేది లేకుండా బాహాటంగా కలప అక్రమ రవాణ అవుతుంటే అధికారులు తీరు ఏ విధంగా ఉంది అనేది తేటతెల్లం అవుతోంది. ఇప్పటికైన సంబంధిత అటవీశాఖాధికారులు స్పందించి కలప అక్రమ రవాణ అరికట్టాని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ ఫార్మసీ దినోత్సవం



ప్రముఖులను సత్కరిస్తున్న అతిథులు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయం సమీపంలోని వికాశ్ ఫార్మసీ కాలేజీలో శనివారం జాతీయ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సభ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఈఓ డాక్టర్ ఎస్.రామరాజు మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు క్లినికల్ విభాగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. వైద్యుడు, రోగికి మధ్య ఉన్న దూరాన్ని పూరించాలన్నారు. దీనిలో భాగంగా వివిధ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లను యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుమలత తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి చూపిన బాటలో పయనించాలి

సత్యసాయి బోధనలతో భారతీయ సనాతన ధర్మాలు విశ్వవ్యాప్తం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: భారతీయ సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు భగవాన్ సత్యసాయిబాబా అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలోని ప్రశాంత్ స్కూల్‌లో సత్యసాయిబాబా జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు సత్యసాయిబాబా బోధనలు నేర్పించాలన్నారు. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు.

పోషణ్ వాటికతో ఆరోగ్యకర సమాజం



జి.మామిడాడ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్క నాటుతున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితం ఇవ్వడానికి పోషణ్ వాటిక కార్యక్రమం దోహదపడుతుందని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు పెద్దాడ సెక్టార్ పరిధిలోని జి.మామిడాడ గ్రామంలో పోషన్‌వాటిక పథకంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 11 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పథకం మంజూరైందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గంగాభవానీ, సీహెచ్.ప్రమీలరాణి, సచివాలయం కార్యదర్శి ఎస్.కనకనాగేంద్ర పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో జీవితాలు ధన్యం



పెదరాయవరంలో బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

రంగంపేట: భగవాన్ సత్యసాయిబాబా సూచించిన విధంగా సమాజసేవలో పాల్గొని మానవ జీవితాలను ధన్యత చేకూర్చుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రంగంపేట సబ్‌జోన్ కన్వీనర్ ఎం.వీర్రాజు సూచించారు. శనివారం భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి ఉత్సవాలను స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన, బాబా దివ్య పాదుకలు, చిత్ర పటానికి అష్టోత్తర సహస్రనామార్చన, సామూహిక సత్యసాయి వ్రతాలు, బాబా చిత్రపటం ఊరేగింపు, మధ్యాహ్నం అన్నదానం, వస్త్రదానం, రాత్రి భజన తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. మండలంలోని కోటపాడు, ఈలకొలను, పెదరాయవరం, చంద్రేడు, రంగంపేట, సుభద్రంపేట, వడిశలేరు, దొడ్డిగుంట, ముకుందవరం గ్రామాల్లో బాబా జయంతి ఉత్సవాలు జరిగాయని జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఆయా భజన మండలి, సేవా సమితి కన్వీనర్లు కందర్ప వెంకట అమర్నాధ్, ఉండవిల్లి వెంకట్రావు, కంటిపూడి సతీష్, చావా భోదియ్య తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎస్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామి ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609

సీతారామ ఫిషర్‌మెన్ సొసైటీకి పురస్కారం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలోని శ్రీ సీతారామ ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీని ఉత్తమ సొసైటీగా గుర్తించారు. గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా సొసైటీకి పురస్కారం అందించారు. మత్స్యశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా బిక్కవోలు ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ వద్ద సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు జంపా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సభ్యులందరి కృషితో ఈ అవార్డు సాధించామని చెప్పారు.

మండల రేషన్ డీలర్ల యూనియన్ ఎంపిక

మధురపూడి: కోరుకొండ మండల రేషన్‌డీలర్ల యూనియన్ ఎంపిక శనివారం జరిగింది. కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంపై ఉన్న మీటింగ్ హాల్‌లో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మాతా సీతారాముడు, ఉపాధ్యక్షుడి అల్లంకి మణి, కార్యదర్శిగా ఇండిగమెల్లి సత్యనారాయణ, కోశాధికారిగా ఉమా మహేశ్వరరావు ఎంపికయ్యారు. వీరిని డీలర్లు, మండల స్థాయి అధికారులు అభినందించారు.

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరికి అభినందనలు

మధురపూడి: రుడా చైర్మన్‌గా ఎంపికైన బీవీఆర్ చౌదరికి బీజేపీ రాజానగరం కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి శనివారం అభినందనలు తెలిపారు. బీవీఆర్ చౌదరి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రాజమహేంద్రవరంలో జరగనుంది. ఈ నేపథ్యంలో పలువురు రుడా చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా భగవాన్, శివబాబు

మధురపూడి: యూటీఎఫ్ కోరుకొండ మండలశాఖ అధ్యక్షుడిగా టీవీ భగవాన్, ప్రధాన కార్యదర్శిగా జీవీ శివబాబు ఎన్నికయ్యారు. శనివారం కోరుకొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సభలో సభ్యులు నాయకులను ఎన్నుకున్నారు. ఈ సభలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు, గౌరవ అధ్యక్షుడిగా డీఎల్‌కే ప్రసాద్, సహాధ్యక్షుడిగా రాజేష్, శాంతి, కోశాధికారిగా చెల్లారావు, 18 మంది సభ్యులు ఎన్నికయ్యారు.


ఉన్నత పాఠశాల తనిఖీ



వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీవైఈఓ నారాయణ

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డీవైఈఓ నారాయణ శనివారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలించారు. అదేవిధంగా టీచర్ల డైరీ, వారు పాఠాలు చెప్పే బుక్ చూశారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే విధానం తదితర వాటిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

రాజానగరం: నరేంద్రపురంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్, ఎంఎల్‌హెచ్‌పీ రేఖ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎస్‌టీఐ వ్యాధుల నియంత్రణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ వ్యాధికి అలైంగిక సంబంధాలే ప్రధాన కారణమవుతున్నాయన్నారు. అవగాహన లోపంతో, అనాలోచితంగా యువత ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధి సోకిన వారు ఏఆర్టీ మందులు వాడడంతో జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ రామకృష్ణ, శ్రావణి, గ్రామ సచివాలయ వైద్య సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

పశుగణన 30 శాతం పూర్తి



చినకొండేపూడిలో పశు గణన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ ప్రభావతి

సీతానగరం: మండలంలో పశుగణన 30 శాతం పూర్తైందని పశు సంవర్ధక శాఖ ఏడీ పి.ప్రభావతి తెలిపారు. మండలంలోని బొబ్బిల్లంక, మునికూడలి, కాటరం, చినకొండేపూడి గ్రామాల్లో పశు గణన కార్యక్రమాన్ని శనివారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 17 టీమ్‌లు పాల్గొని పశు గణణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. మరింత వేగవంత చేయాలని సిబ్బందికి తెలియజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.